# పైశాచిక ప్రవృత్తి



*వనే ఖిలకలాసక్తాః*
*పరిహృత్య నిజస్త్రియః*
*త్వద్వైరి వనితా బృందే*
*పుళిందాః కుర్వతేరతం*

***భావం:*** అన్ని కళలలోనూ ఆసక్తి ఉన్న పుళిందులు అడవిలో తమ స్త్రీలను వదిలి నీ శత్రుస్త్రీ బృందంతో శృంగారం సాగిస్తున్నారు.

యుద్ధం చేసి జయించడం వీర ధర్మమనుకున్న మహారాజు శత్రురాజుపై దండెత్తాడు. శత్రురాజూ, అతని బంధువర్గమూ, సైనికులూ

మరణించారు. విజయోత్సాహంతో ఉన్న మహారాజు తన సైనికులని సంబరాలు జరుపుకోమని శలవిచ్చాడు. శత్రురాజూ, సైనికులూ మరణించారు కానీ స్త్రీలు జీవించే ఉన్నారు. జయించిన ఉన్మాదంతో ఉన్న సైనికులు శత్రు స్త్రీలపై విజృభించి అత్యాచారాలు ప్రారంభించారు. నిస్సహాయులైన ఆ స్త్రీలు అడవిలోకి పారిపోయారు.

అడవిలోనూ వారికి ఆపద తప్పలేదు. అక్కడ ఉన్న పుళిందులు అనే ఆటవిక జాతివారు సంగీతం, నాట్యం వంటి అన్ని కళలలోనూ ఆసక్తి ఉన్నవారు. వారి స్త్రీలు గురివింద పూసలతో, నెమలి ఈకలతో, అడవి మల్లె తీగలతో అలంకరించుకుని ఆడి పాడేవారు. అటువంటి పుళిందులకు పట్టుచీరలతో, బంగారు నగలతో, రత్నాభరణాలతో ఉన్న రాజవంశ స్త్రీలను చూడగానే కొత్తగా, వింతగా కన్పించింది. తమ స్త్రీలకన్నా వీరే అందంగా ఉన్నారనుకున్నారు. తమ స్త్రీలను వదిలి వీరిపై పడ్డారు. పారిపోవడానికి కూడా లేకుండా కట్టివేసి సామూహిక మానభంగం ప్రారంభించారు.

అడవిలో ఉన్న సన్యాసికి పరిస్థితి చక్కదిద్దాలనిపించింది. మహారాజుతో విషయం చెప్పడానికై రాజసభకు వచ్చాడు. రాజు విజయోత్సవం ఘనంగా చేసుకుంటున్నాడు. కవులు ఆయన సాహసాన్ని వర్ణిస్తూ పద్యాలు చెప్పి బహుమతులు పొందుతున్నారు.

సన్యాసి ఆలోచించాడు. ఈ సమయంలో ఉన్నదున్నట్లుగా చెప్తే మహారాజు ఎలా తీసుకుంటాడో తెలియదు. కోపగించి తన ప్రాణం తీసినా ఫరవాలేదు. అడవిలో ఆడవాళ్ళు రక్షింపబడితే చాలు.

తనవంతు రాగానే సన్యాసి "మహారాజా, సకల కళాసక్తులైన పుళిందులు అడవిలో తమ స్త్రీలను వదిలి నీ శత్రుస్త్రీలతో శృంగారం సాగిస్తున్నారు." అని పద్యం చెప్పాడు.

మామూలుగా విన్న వారికి పద్యం రాజుని కీర్తిస్తున్నట్లే ఉంది. కానీ ధర్మపరుడైన మహారాజు ఆలోచించాడు. యుద్ధం వీరధర్మం అని నమ్మి యుద్ధం చేశాడు కానీ స్త్రీలను బాధించడానికి కాదే, అసలు శత్రు స్త్రీలు అడవిలోకి ఎందుకు పారిపోవాల్సి వచ్చింది?

విచారణ చేయగా తన సైనికుల అత్యాచారాలు బయటపడ్డాయి. వారిని శిక్షించాడు. శత్రు స్త్రీలకు నగరంలో రక్షణ కల్పించాడు. యుద్ధ సమయంలో సైనికులు శత్రు స్త్రీలను సైతం మర్యాదగా చూడాలన్నది ప్రాచీన భారతదేశంలో యుద్ధనీతి.

చివరగా తెలుగువారికి ఒక చిన్న విషయం తెలియచేయాలి. శత్రు స్త్రీలను మర్యాదగా చూసేవాడని ఛత్రపతి శివాజీకి పేరుంది. కానీ అంతకుముందే శ్రీకృష్ణదేవరాయలు "తదవరోధ మగపడ్డ పుట్టింటిరూఢి నెరపు" మన్న నీతిని చెప్పారు. శత్రు స్త్రీలకి మామూలు మర్యాదమాత్రమే చెయ్యడం కాదు పుట్టింటి వారిలా చూడాలట, శివాజీకి వచ్చిన పేరు కృష్ణరాయలకెందుకు రాలేదో, తెలుగువారి లోపమా లేక ఆయన కన్నడ రాయలేనన్న ఉదాసీనతా?

******